
# ఆరో ప్రాణం



చొక్కారావు ఆ ఊళ్ళో ఛోటా నాయకుడు. పదవి లేకున్నా పరపతి ఉన్న వ్యక్తి. పలుకుబడి మాట అటుంచి బంగారం పండే పదెకరాల పొలం ఉందతగాడికి. అందుకే ఉద్యోగం సద్యోగం లేకపోయినా జమీందార్లా దర్జాగా మీసం మెలేస్తూ తిరుగుతుంటాడు. అంతో ఇంతో అధికార పార్టీ నాయకుల అండదండలుండటం వల్ల తమ పనులు చక్కబెట్టుకోడానికి చాలామంది అతడి చుట్టూ ప్రదక్షణలు చేస్తుంటారు. ఓవర్గం అహర్నిశలు అతణ్ణి అంటిపెట్టుకునే ఉంటుంది. చొక్కారా వంటే కొందరికి ఇష్టం కొందరికి కష్టం.

మహనీయుల విగ్రహాల్ని చూసినప్పుడల్లా తన విగ్రహాన్ని కూడా ప్రతిష్టిస్తే బావుండుననుకుంటాడు చొక్కారావు. ఇది ఈనాటి పిచ్చికాదు. ఎప్పటి నుంచో మనసులో గూడు కట్టుకున్న కోరిక. ఉండబట్టలేక, ఓ రోజు అనుచరుల ముందు తన కోరికను బయటపెట్టాడు.

"మీ ఆలోచన దివ్యంగా వుంది. ఆదర్శ సంఘ సేవకులైన తమవంటి వారి విగ్రహాన్ని ప్రతిష్టించి తీరవలసిందే" ప్రోత్సహించాడు అవధాని.

"విగ్రహం చేయించడానికి బోలెడంత ఖర్చవుతుందేమో!" సందేహం వ్యక్తం చేసాడు అనుచరగణంలో మరో ఆసామి ఆ భారం తమనెత్తిన ఎక్కడ పడుతుందోనని బెంగపడుతూ.

"అయితే అవనివ్వవయ్యా, ఆ ఖర్చు నిన్ను భరించమనలేదు కదా! పాట్లు నావి.

ఏర్పాట్లు మీవి సరేనా" అన్నాడు చొక్కారావు.

"నాదో చిన్న డౌటు మీరేమీ అనుకోనంటే..." బుర్రగోక్కుంటూ అన్నాడు పానకాలు.

"అదేదో తొందరగా చెప్పి తగలడు" అన్నట్లు అతడి వంక గుర్రుగా చూసాడు చొక్కారావు.

"నాకు తెలిసి సాధారణంగా కీర్తిశేషుల విగ్రహాల్నే ఆవిష్కరిస్తుంటారు. మరి మీరేమో ..." అంటూ ఆగాడు.

"పానకాలు చెప్పింది సబబుగానే ఉందయ్యా. మీ తదనంతరం మనవాళ్ళు ఎలాను తమ విగ్రహాన్ని ప్రతిష్టించకమానరు. అనవసరంగా ఇప్పుడే మీ చేయి కాల్చుకోవడ మెందుకు" మాట మార్చాడు అవధాని.

చిర్రెత్తుకొచ్చింది చొక్కారావుకి.

"ఏడిసినట్లుంది నీ చచ్చు సలహా. నేను చచ్చాక మీరేం చేస్తారో నేను చూస్తానటయ్యా! ఆ పనేదో ఇప్పుడే కానిచ్చేస్తే బావుంటుంది" అన్నాడు.

"మీ మాటకు అడ్డొస్తున్నందుకు మన్నించండి. గొప్పవాళ్ళ మృతదేహాల్ని గంధపు చెక్కలతో దహనం చేస్తారని తెలిసినా ఆ తంతేదో ఇప్పుడే జరిపించేయమనలేం కదా" చమత్కరించాడు అతగాడితో సన్నిహితంగా మెలిగే మల్లేషు.

"ఇది మరీ బావుంది. అది ఇది ఒకటెలా అవుతుందయ్యా" చిరాకుపడ్డాడు చొక్కారావు.

తమ నాయకుడికి కోపం వచ్చిందని గ్రహించి మరి మాట్లాడలేదు మల్లేషు.

"వాడి మాటకేం గాని మేమంతా మీ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని ఏక గ్రీవంగా, తీర్మానించేసాం" అందరి తరపున వకాల్తా పుచ్చుకుంటూ అన్నాడు అవధాని.

అతడి నోటినుంచి ఆ మాట ఊడిరావడమే ఆలశ్యం విగ్రహానికి ఆర్డరిచ్చేసాడు చొక్కారావు.

ఇచ్చిన గడుపులోపలే విగ్రహాన్ని తయారుచేసి పట్టుకొచ్చాడు శిల్పి.

"ఆలశ్యం అమృతం విషం అన్నారు. త్వరగా విగ్రహ ప్రతిష్టాపన జరిపించేస్తే బావుంటుంది" అన్నాడు అవధాని.

ఆ ముక్కకోసమే ఎదురుచూస్తున్న చొక్కారావు "కానివ్వండి మీదే లేటు" అన్నాడు తెగ ఉబలాటపడిపోతూ.

మరుచటిరోజే ఊరి సర్పంచిగారి చేతుల మీదుగా డప్పువాయిద్యాల నడుమ ఎంతో అట్టహాసంగా జరిగిపోయింది చొక్కారావు విగ్రహప్రతిష్టా పన.

సదరు కార్యక్రమానికి ఊరంతా హాజరైంది.

జనం చప్పట్లు చరిచారు.

జైకొట్టారు.

ఆ సంబరం అంబరాన్ని తాకడంతో చొక్కారావు ఆనందం అంచులుదాటింది. తనవితీరా తన విగ్రహాన్ని ఒకటికి పదిసార్లు చూసుకుని మురిసిపోయాడు. గుండ్రటిమొహం, దుబ్బుమీసం, తెల్లటి పైజమా మీద ఎర్రటి పొడుగాటి లాల్చీ, భుజం మీద జరీ కండువా,

వాహ్! ప్రపంచ నాయకుల విగ్రహాల్ని సైతం తలదన్నేటట్లు ఉందనుకుని తెగ సంబరపడి పోయాడు. సంతోషాన్ని పట్టలేక అందరికీ మిఠాయిలు పంచాడు.

వచ్చినవాళ్ళంతా చొక్కారావుకి కరచాలనం చేసి వెళ్ళిపోయారు.

అంతవరకు బాగానే ఉంది. ఆ తర్వాత మొదలయ్యాయండీ ఆయనగారి కష్టాలు.

విగ్రహానికి రక్షణ లేకపోవడంవల్ల దానిమీద పక్షులు రెట్టలు వేస్తున్నాయని తెలిసి మనోవ్యథకు గురయ్యాడు చొక్కారావు. అప్పటికప్పుడు పనివాళ్ళను పిలిపించి దాని నెత్తిమీద సిమెంటు గొడుగు కట్టించాడు. రాత్రుళ్ళు కూడా తన విగ్రహం స్పష్టంగా కనపడాలని దాని ప్రక్కనే స్ట్రీట్ లైటు ఏర్పాటు చేయించాడు. ఆ విగ్రహం ఇప్పుడు తనకు ఆరోప్రాణమై కూర్చుంది. రోజుకొక్కసారైనా విగ్రహాన్ని చూసుకోకుండా ఉండలేకపోతున్నాడు. అలా అని ప్రతిరోజు తన బొమ్మని చూస్కోడానికి మూడురోడ్ల కూడలికెళితే అంతా నవ్వుకుంటారేమో! అందుకే మనసు లాగుతున్నా ఆ ప్రయత్నం విరమించాడు. అయినా కోరిక గుండెల్ని కుదిపేస్తోంది. మనసు ఉండబట్టక ఓ రోజు అర్ధరాత్రి ఊరు నిద్ర పోతున్నప్పుడు నిండా ముసుగేసుకుని వెళ్ళి విగ్రహాన్ని తనివి తీరా చూసొచ్చాడు. నాటి నుంచి ఇదే బావుందనుకుని అదే గెటప్‌లో ఎవరి కంటబడకుండా వెళ్ళి విగ్రహాన్ని చూసొస్తున్నాడు.

ఇలా ఉండగా ఓ రోజు పానకాలు పరుగెత్తుకుంటూ వచ్చి "అయ్యా మీ కీ విషయం తెలుసా? రాత్రిళ్ళు మనూళ్ళో ముసుగుమనిషి సంచరిస్తున్నాడంట, దొరికితే బడిత పూజ చేద్దామని మనవాళ్ళు కాపుకాసుక్కూర్చున్నారు" అంటూ బాంబు పేల్చాడు.

ఆ మాటకు అదిరిపడ్డాడు చొక్కారావు.

అమ్మో త్రుటిలో ఎంత ముప్పు తప్పింది. ఈ వెధవ ముందుగా చెప్పి తగలడ్డాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఇవాళ మటాష్ అయిపోయేవాణ్ణి అనుకుని అప్పటినుండి రాత్రిపూట బయటకు కాలుపెట్టడం మానేసాడు.

పదిరోజులు గడిచాయి.

ముసుగుమనిషి వదంతి సద్దుమణిగింది. మళ్ళీ విగ్రహం మీదికి మనసు మళ్ళింది చొక్కారావుకి. ఏదైతే అది అయిందనుకుని మరోసారి ముసుగుమనిషి అవతారం ఎత్తాడు.

సరిగ్గా మూడురోడ్ల కూడలి చేరుకోగానే ఎవరో దుడ్డుకర్రతో దభీమని నెత్తిమీద ఓ బాదు బాదారు.

ఆ దెబ్బకు తాళలేక 'చచ్చాన్రా బాబోయ్' అంటూ ముసుగు తొలగించాడు చొక్కారావు. లేకుంటే మరో రెండు దెబ్బలు పడుండేవి.

"అయ్యా! తమరా.. క్షమించండి. మీరేంటి ఈ వేళప్పుడు ఇక్కడ" అన్నాడు మల్లేషు బొప్పికట్టిన చొక్కారావు బుర్రను చేత్తో మర్దిస్తూ.

"మీ చేత తన్నులు తినడానికి. లేకపోతే ఏంటయ్యా, కొట్టేటప్పుడు ఎవరో ఏంటో

చూడకుండా గొడ్డును బాదినట్లు బాదేయడమేనా? నేనూ మీలాగే ముసుగుమనిషిని పట్టుకుందామని ముసుగేసుకొచ్చాను" నోటికొచ్చిన బొంకు బొంకాడు చొక్కారావు. అంతే, ఆ రోజు లగాయితూ రాత్రిళ్ళు గడపదాటితే ఒట్టు. తను చూడకపోతేనేం అంతా తన విగ్రహాన్ని చూస్తూనే ఉన్నారు, అది చాలనుకుని తృప్తిపడ్డాడు. అయితే పరిస్థితులు అతడిని అలా కూడా ఉండనివ్వలేదు.

"అయ్యా! తమ విగ్రహంమీద ఎవరో బురద చల్లారయ్యా. ఇది ముమ్మాటికీ మన ప్రత్యర్థుల పనే. సందేహం లేదు" అంటూ ఫిర్యాదు చేసాడు అవధాని.

ఆ మాటకు ప్రాణం చివుక్కుమంది చొక్కారావుకి. ఆఘమేఘాల మీద వెళ్ళి విగ్రహాన్ని పరిశుభ్రం చేయించే పనిలోపడ్డాడు. విగ్రహాన్ని ఎంత కడిగినా అక్కడక్కడ మచ్చలు దర్శనమిస్తూనే ఉన్నాయి.

ఉన్నట్లుండి ఊళ్ళో ఉవ్వెత్తున ఏదో ఉద్యమం లేచింది. విధ్వంసకార్లు కనిపించిన వాటినన్నిటిని ధ్వంసం చేస్తున్నారు. గ్రామంలో 144వ సెక్షను అమల్లోకొచ్చింది. పోలీసులు దుండగుల్ని పట్టుకుని చితకబాదుతున్నారు. దాంతో వాళ్ళు మరింతగా రెచ్చిపోతున్నారు. వారి కోపాగ్నికి చొక్కారావు విగ్రహం సైతం బలైపోయింది.

ఆదరాబాదరా మూడు రోడ్ల కూడలికి పరుగుతీసాడు చొక్కారావు. మొండి చెయ్యితో విగ్రహం వికృతంగా కనిపించింది. చూడలేక కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. ఎవరో తన చెయ్యిని నరికేసినంత బాధ కలిగింది. ఉన్నపళంగా శిల్పిని పిలిపించి చెయ్యిని అతికించాడు. అయినా అతుకు స్పష్టంగా కనిపిస్తూనే వుంది.

ఆ రోజు అతడికి తిండి తినబుద్ధి కాలేదు.

కంటిమీద కునుకుపడితే ఒట్టు. రాత్రంతా పక్కమీద అటు ఇటు దొర్లాడు. కోడికూసే సమయంలో రెప్పపడింది. నిద్రలో దుండగులు తన విగ్రహం రెండు చేతుల్ని నరికేసినట్లు కలగన్నాడు. గుండె గుభిల్లుమంది. గభాలున లేచి కూర్చున్నాడు. నాటి నుంచి అదే తంతు. పడుకుంటే ఓ పట్టాన నిద్రపట్టదు. రెప్పపడితే అదే దృశ్యం. తను ప్రాణంకంటే మిన్నగా చూసుకుంటున్న విగ్రహం మొండిగా కనిపిస్తూ అతడీని చిత్రవధకు గురిచేయ సాగింది. బతికుండగా విగ్రహాన్ని ఎందుకు పెట్టకూడదంటారో ఇప్పుడు తెలిసొచ్చింద తగాడికి.

అంతే, అప్పటికప్పుడు అనుచరులని పిలిపించి విగ్రహాన్ని తొలగించమని ఆదేశించి ఊపిరి పీల్చుకున్నాడు.

(ఫిబ్రవరి 16, 2012 ఆంధ్రభూమి వారపత్రిక)